క్లుప్తంగా

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కమలాపూర్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 18, 19 వ తేదీల్లో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యమ కార్యాచరణ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ అధ్వర్యంలో ఈనెల 18, 19 తేదీల్లో మండల కేంద్రాల్లో నిర్వహించే బైక్ ర్యాలీలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ సీనియర్ నాయకులు జయప్రకాష్, కమలాపూర్ మండల అధ్యక్షుడు చందుపట్ల రాజేంద్రం, ప్రధాన కార్యదర్శి భాస్కర్, చంద్రగిరి లక్ష్మయ్య, రమేష్, రాజు, భిక్షపతి, నరసింహారెడ్డి, ఉపేందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని చౌళ్ళపెల్లికి చెందిన అనూష వ్యక్తిగత పనులపై మండల కేంద్రంకు వెళ్లి కొత్త బస్టాండు సమీపంలో రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో కారు ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం నగరంలోని ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

ఐనవోలు: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో 50 మంది విద్యార్థులకు దాత సిద్ధేశ్వర శర్మ పలకలు అందించగా హెచ్‌ఎం మాట్లాడారు. పేద విద్యార్థులకు సహకారం అందిస్తున్న దాతల సేవలు వరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కుమారస్వామి, ఉపాధ్యాయులు మధుకర్, బీమళ్ల సారయ్య, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల మద్దతు

ఎల్కతుర్తి: తమ డిమాండ్లను నెరవేర్చాలని గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె తొమ్మిదో రోజు కొనసాగుతుంది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన సమ్మెకు శుక్రవారం బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, మధుకర్, అశోక్, ఆదామ్, దేవేందర్, సదానందం, కనుకయ్య, కపివర్ధన్, సురేందర్, వెంకట్, అర్జున్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

‘సస్పెండ్ చేయడం హేయమైన చర్య’

పరకాల: విద్యార్థి దశ నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటున్న తనను బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయడం హైయమైన చర్యని బీఆర్‌ఎస్ బహిష్కృత నాయకుడు, గూడెప్పాడ్ వైస్‌చైర్మన్ గజ్జి విష్ణు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులతో అమరధామంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ అడుగు జాడల్లో నడుస్తున్న తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసే హక్కు కేసీఆర్‌కు తప్పా ఏవరికీ లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్ని వర్గాల ప్రజలను కించపరుస్తున్నందుకే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి టికెట్ ఇవ్వకుండా తెలంగాణ ఉద్యమకారులకు ఇవ్వాలనే డిమాండ్‌ను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

దరఖాస్తు చేసుకోవాలి

ధర్మసాగర్(వేలేరు): మండలంలోని సన్న, చిన్న కారు రైతులు వివిధ రకాల పండ్ల తోటల పెంపకం కోసం దరఖాస్తు చేసుకోవాలని వేలేరు ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. సన్నకారు, చిన్న కారు సర్టిఫికెట్, పట్టా పాసుబుక్కులు, జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్ కాపీలను ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఈనెల 17వ తేదీలోపు సమర్పించాలని కోరారు.

ఎస్సైకి సన్మానం

శాయంపేట : శాయంపేట ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఇమ్మడి వీరభద్రరావు బదిలీపై పర్వతగిరికి వెళ్లిన విషయం తెలిసిందే. కాగా శుక్రవారం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన అబ్బు ప్రకాశ్‌రెడ్డి, యువసైన్యం యూత్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

మొక్కలు నాటిన సర్పంచ్

నడికూడ: హరితహారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో సర్పంచ్ ఊర రవీందర్ రావు మొక్కలు నాటారు. ప్రతీ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నీరటి రాములు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు పుట్టెడు కష్టాలు

- సిబ్బంది జీతాలకు సరిపోని ఆస్తి పన్ను
- పనులు పూర్తైనా అందని బిల్లులు
- మరో 8నెలల్లో పూర్తి కానున్న సర్పంచ్‌ల పదవీ కాలం



శిథిలావస్థలో ఉన్న అలియాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం

పరకాల: సరిపడా నిధులు లేకపోవడంతో చిన్న చిన్న పంచాయతీలకు పుట్టెడు కష్టాలు తప్పడం లేదు. కొందరు ఎందుకయ్యాం సర్పంచ్‌లుగా అంటూ తలలు పట్టుకుంటున్నారు. గ్రామ పంచాయతీల ఏర్పాటు సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, స్థానిక ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో గ్రామపరిపాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. చిన్న గ్రామ పంచాయితీల పరిధిలో దాదాపు 100 నుంచి 200 లోపు ఇళ్లు మాత్రమే ఉండటంతో ఆస్తి పన్నులు వసూలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సరిగ్గా ఏడాది పన్నులు వసూలు అయినా సిబ్బందికి 2 నెలల వేతనాలు సరిపోవడం లేదు. పరకాల మండలం పరిధిలో 10 గ్రామ పంచాయతీలలో రాజిపేట, సీతారాంపూర్ రెండు గ్రామాలు పరకాల మున్సిపాలిటీలో విలీనం కావడంతో మరో రెండు కొత్త గ్రామ పంచాయతీలు పైడిపల్లి, హైబోతుపల్లి గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. మూడున్నర సంవత్సరాలుగా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే చెప్పుకోవచ్చు. పెద్ద గ్రామ పంచాయతీలు నిల్వ ఉన్న నిధులతో నెట్టుకొస్తుంటే చిన్న గ్రామపంచాయతీలకు మాత్రం తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. తప్పని పరిస్థితితుల్లో సర్పంచ్‌లు తమ జేబులో నుంచి డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకొద్దామనుకున్నా ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో సర్పంచ్‌లు నోరు మెదపడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



పాఠశాల భవనంలో ఏర్పాటు చేసిన పైడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

శిథిలావస్థలో పంచాయతీ భవనాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవడంతో కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయితీలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. పక్కా భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాల లేదా శిథిలమైన భవనాలలోనే గ్రామ పంచాయతీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కొందరు సర్పంచ్‌లు తమ నివాసాలనే కార్యాలయాలుగా మార్చుకొని సిబ్బందితో సమావేశం అవుతున్నారు.

సమాధానం చెప్పలేకపోతున్నాం



నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీకి మొదటి సర్పంచ్‌గా గెలిచాననే సంతోషం ఉంది. కానీ ప్రభుత్వం నుంచి నిధుల కొరత చాలా వేధిస్తుంది. దీంతో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతున్నాం. వర్షకాలంలో బురద రోడ్లు, అస్తవ్యస్థమైన డ్రైనేజీలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయితీ భవనానికి రూ.12 లక్షలతో ప్రతిపాదనలు చేసి నప్పటికీ ఇంత వరకు చిల్లీ గవ్వ రాలేదు.

- అడ్డికిల సరిత, పైడిపల్లి సర్పంచ్

గరంగరంగా మండల సభ

- హాజరైన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



ఎంఈఓను నిలదీస్తున్న ఎమ్మెల్యే

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య వాడివేడిగా కొనసాగింది. సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ గండ్ర జ్యోతిలు హాజరయ్యారు. సభలో ముఖ్యంగా విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయశాఖలపై చర్చ కొనసాగింది. విధులు సరిగా నిర్వర్తించని అధికారులపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఫైర్ అయ్యారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యాధికారి సాయికృష్ణ సరిగా హాజరుకావడం లేదని ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, సర్పంచ్ కందగట్ల రవి సభ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ప్రజలకు అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. గట్లకానిపర్తి ఏఎన్‌ఎం విధులకు సక్రమంగా నిర్వర్తించడం లేదని సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య తెలుపగా స్పందించిన ఎమ్మెల్యే డీఎం అండ్‌హెచ్‌ఓ తో ఫోన్లో మాట్లాడి అక్కడి నుంచి బదిలీ చేయాలని ఆదేశించారు. మండలంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, ఎంతమంది టీచర్లు ఉన్నారని ప్రశ్నించగా వివరాలు తన వద్ద లేవని ఇంచార్జ్ ఎంఈవో రమాదేవి తెలుపగా ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయి సమాచారం లేకుండా మండల సభకు ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం నుంచి పదివేలు ఖర్చు చేస్తుందని, ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ మండల ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి ముందుకు సాగాలని తెలిపారు. ఈ సంవత్సరం వర్షాభావం తక్కువగా ఉన్నందున ప్రతీ నీటి చుక్కను చెరువులకు మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం నేరుడుపల్లి గ్రామానికి చెందిన బోసు జంపయ్య, చట్ల కిరణ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అమంచ కృష్ణమూర్తి, ఏఎంసీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం. వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

‘నులి’ పురుగును నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

దామెర: నులిపురుగుల నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కాగితాల శంకర్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ సమావేశం ఏర్పాటు చేయగా ఆయన మాట్లాడారు. ఈ నెల 20 వ తేదీన నుంచి 27వ తేదీ వరకు నులిపురుగుల నివారణ మాత్రాలు(ఆల్బెండజోల్) పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలకు మాత్రలను తినిపించాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతీ ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకొని రక్తహీనత నివారణకు కృషి చేయాలని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రవీందర్, స్థానిక సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, హెచ్‌ఈఓ అశోక్‌బాబు, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, భాగ్యలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, రాణి, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ తడక రాణి

కమలాపూర్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలని ఎంపీపీ తడక రాణి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ రాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వివరాలను అధికారులు సభలో చదివి వినిపించారు. కానిపర్తి, శంభునిపల్లి గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని బావుల ద్వారా నీళ్లు సరఫరా చేయడం ద్వారా రూ.58 వేల కరెంటు బిల్లు వచ్చిందని ఆయా గ్రామాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నప్పటికీ వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిచడం లేదని, గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడం లేదని ప్రజాప్రతినిధులు అన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచాలంటే శంభునిపల్లి పాఠశాలలో విద్యార్థులను చేర్పించామని, ఇక్కడ పని చేసే ఉపాధ్యాయులు ఎక్కువగా సెలవులపై వెళ్తున్నారని, ఒకరిద్దరు ఉపాధ్యాయులు పాఠశాలకు వస్తే విద్యార్థులకు చదువులు ఎవరు చెప్తారని సర్పంచ్ రవీందర్‌రెడ్డి ప్రశ్నించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కళ్యాణి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, ఎంపీడీఓ పల్లవి, తహసీల్దార్ రాణి, మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చంద్రయాన్ -3పై అవగాహన



శాయంపేట: మండలంలోని గట్లకానిపర్తిలో గల నాగార్జున పాఠశాలలో చంద్రయాన్ 3పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఇస్రో తయారు చేసిన చంద్రయాన్ 3 రాకెట్ మోడల్ పరికరాన్ని విద్యార్థులతో తయారు చేయించి దానిపై అవగాహన కల్పించారు. భారతదేశ శాస్త్రవేత్తల ఔనత్యాన్ని పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గుర్రం అశోక్, ప్రిన్సిపాల్ వినిష్, ఉపాధ్యాయులు ధనిత్‌రాజ్, అనుప్రియ, ఆషారాణి, సబిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీలో వైద్య పరీక్షలు

ధర్మసాగర్: మండలంలోని కరుణాపురం ఎంజేపీటీ పాఠశాలలో గల విద్యార్థులకు పీహెచ్‌సీ డాక్టర్ గోపినాథ్ శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 125 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా అందరికీ ఫంగల్ ఇన్‌ఫెక్షన్ సోకినట్టుగా నిర్ధారించారు. వారికి మందులు పంపిణీ చేసి తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, ఎల్‌టీ అజీమ్, ఏఎన్‌ఎంలు థోమస్, రజిత, ఆశా వర్కర్ లు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



స్థల పరిశీలన చేస్తున్న డీపీఓ జగదీశ్వర్

దామెర: గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న జీపీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయితీ అధికారి జగదీశ్వర్ సూచించారు. మండల కేంద్రంలోని జీపీ భవనం నిర్మించే స్థలాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం పీహెచ్‌సీ సమీపంలో నిర్మించడం ద్వారా ప్రజలకు ఎంతగానో సౌకర్యంగా ఉంటుందన్నారు. అనంతరం మండలంలోని కోగిల్వాయి పల్లె ప్రకృతి వనంను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ రాగరాజు, స్థానిక సర్పంచ్ గురజాల శ్రీరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

‘చలో ఎస్పీడీని’ విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మసాగర్(వేలేరు): సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. వేలేరు మండలంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ఛలో ఎస్పీడీ కార్యాలయం ముట్టడి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన నిర్వహించతలపెట్టిన ఛలో ఎస్పీడీ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, కేజీబీవీ, యూఆర్‌ఎస్, సీఆర్పీ తదితర కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఒక్క కాంట్రాక్ట్ ఉద్యోగి ఛలో ఎస్పీడీ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నవీన్‌కుమార్, వేలేరు మండల బాధ్యుడు గడ్డి శ్రీనివాస్, అశోక్, కుటుంబరావు, రాజు, కేజీబీవీ సిబ్బంది, ఆ సంఘం నాయకులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీలో జాప్యం తగదు



మాట్లాడుతున్న శాతబోయిన రమేష్

ధర్మసాగర్: యాదవులకు గొర్రెలు పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయడం తగదని తెలంగాణ గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాతబోయిన రమేష్, కాడబోయిన లింగయ్యలు మండిపడ్డారు. మండల కేంద్రంలో గొర్ల కాపర్ల కమ్యూనిటీ హాల్లో శుక్రవారం ఆ సంఘం జిల్లా బేరర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం చేస్తూ గొర్ల కాపరులను మోసం చేస్తుందని ఆరోపించారు. రెండో విడత పంపిణీకి జిల్లాలో 7,348 మంది లబ్దిదారులు ఉండగా గొర్ల కోసం ప్రభుత్వానికి ఐదు నెలల క్రితం 1600 మంది అప్పులు చేసి డీడీలు తీశారని అన్నారు. ఇప్పటి వరకు గొర్రెలను పంపిణీ చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తుందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గొర్రెల పంపిణీకి బదులు నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. గొర్రెలకు, మేకలకు సంవత్సరానికి నాలుగు సార్లు నట్టల నివారణ మందులు అందిస్తామని ప్రకటించి ఒక్కసారి కూడా అందించలేదని అన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పశువైద్యాధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ గొర్ల కాపరుల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి జిల్లా ఎన్నికలు జరపాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు గంటె సమ్మయ్య, వేల్పుల రమేష్, మేకల సాంబరాజు, రాజ్ కుమార్, బండారి నారాయణ, పర్వతాలు, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



శాయంపేట : మండలంలోని రాజుపల్లి గ్రామానికి చెందిన కంది నరసమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ గజ్జెల లావణ్యరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళులర్పించారు. అదే విధంగా మున్నూరుకాపు సంఘం సభ్యులు బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు.

అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట: అత్యవసర సమయంలో ప్రాణాలను రక్షించే అంబులెన్స్ సౌకర్యాన్ని మండల ప్రజలకు కల్పించాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ ముక్కెర ముకేష్, ఎమార్పీఎస్ మండల అధ్యక్షుడు పెంబర్తి భరత్‌చంద్రలు కోరారు. ఈ మేరకు శుక్రవారం సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే గండ వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్సన్ గండ్ర జ్యోతిలకు వినతిపత్రం అందించారు. మండలంలోని ప్రజలు, రైతులు, కార్మికులు, గర్భిణులు అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో అత్యవరసర సమయంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఇతర మండలాల నుంచి అంబులెన్స్ వచ్చే వరకు వేచి ఉండాల్సి వస్తుందన్నారు. సుదర్శన్, అరుణ్, రాజేష్, సందీప్, వినయ్ పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని ప్రభుత్వ విద్యా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగు నీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని అన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. ప్రతీ విద్యార్థికి నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

నడికూడ: మండలంలోని కంఠాత్మకూర్ రైతువేదికలో శుక్రవారం ఆయిల్‌పామ్ పంట సాగుపై ఏఈఓ జ్యోతి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పామాయిల్ సాగు రైతులకు ఎంతో లాభదాయకం అన్నారు. ఎకరానికి 50 మొక్కలు నాటుకోవచ్చని, డ్రిప్ ద్వారా సాగు నీటిని, ఎరువులను ఉపయోగించుకోవచ్చని అన్నారు. మొక్క ధర రూ. 213 ఉండగా 90శాతం సబ్సిడీతో రైతులకు రూ. 20 కే అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ సంవత్సరానికి ఎకరానికి రూ. 4200 ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. అసక్తి గల రైతులు పామాయిల్ పంటను సాగు చేసుకోవాలని సూచించారు. పత్తి, వరి, ఇతర పంటల కంటే పామాయిల్ సాగుతో అధికంగా లాభాలు వస్తాయని అన్నారు. తక్కువ పెట్టుబడితో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీతో రైతులు లాభాలు పొందుతారని సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేకుల సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెళకువలు పాటించాలి

శాయంపేట : పంట సాగులో మెళకువలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని ప్రజ్వల్ ప్రాజెక్టు ఫీల్డ్ ఫెసిలిటేటర్ కల్పన అన్నారు. మండలంలోని సూరంపేటలో నవయుగ సొసైటీ డైరెక్టర్ సూరం మాధవరెడ్డి ఆధ్వర్యంలో బీసీఐ రైతులతో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రధాన పంటగా పత్తిని ఎంపిక చేసుకొని వాటి సాళ్ల మధ్య దూరాన్ని బట్టి పెసర, బొబ్బర, మినుము వంటి తీగజాతి పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. ప్రధాన పంటకు కందులను రక్షణ ఉపయోగించుకోచ్చవని, మొక్కజొన్న వేసుకోవడం వలన కీటకాలను నియంత్రించుకోవచ్చని సూచించారు. అనంతరం ప్రాజెక్టు తరుపున బీసీఐ రైతులకు కందులు, పెసరా సీడ్‌ను అందించారు. రైతులు మన్నెం రాంరెడ్డి, గోపు రాజిరెడ్డి, పరిపాటి జితేందర్‌రెడ్డి, పెద్దరవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ వివాదంలో కుటుంబంపై దాడి

దామెర: మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం భూ వివాదం చోటు చేసుకోగా ఓ కుటుంబంపై దాడి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అడ్డగుడ్డ సదాశివుడుకి సింగరాజుపల్లి గ్రామ శివారులో 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే ఈ భూమిపై గత కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతుంది. సదాశివుడు పత్తిగింజలు విత్తుకుంటుండగా అదే గ్రామానికి చెందిన కొందరు ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి భూమిలో ఎమ్మార్పీఎస్ జెండాలు పాతారు. సదాశివుడు తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడి చేరకోగా సింగరాజుపల్లికి చెందిన వడ్డెపల్లి రాజేందర్‌తో పాటు కొంతమంది సదాశివుడు కుటుంబ సభ్యులపై దాడిచేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత 30 సంవత్సరాలుగా తమ భూమిపై కొంత మంది దళితులు కన్నేసి తమ దంటూ ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కాగా వడ్డెపల్లి రాజేందర్, కొంత మంది ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వంద మంది దళితులకు సంబంధించిన భూమిని సదానందం అక్రమంగా కబ్జా చేశారని ఇదే విషయంపై మాట్లాడేదుకు వెళ్లిన తమను కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మహంకాళి అమ్మవారికి బోనాలు



ఐనవోలు: మండలంలోని గర్మిళ్లపెల్లి గ్రామంలో గల మహంకాళి అమ్మవారికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం ముదిరాజ్‌లు, యాదవులు, పద్మశాలిలతో పాటు పలువురు మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్లతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి మల్లిక, గ్రామస్తులు శంకర్ రాజు, బొళ్ల నాగరాజు, సురేష్, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.